TELTEL/2023/87917

# జనంవెలుగు

అనునిత్యం అక్షరసత్యం

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com

విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 02 | సంచిక : 330 | శుక్రవారం 21 - 02 - 2025 | ఎడిటర్ : సీతార్ల సురేష్ | పేజీలు : 8 | వెల : 6 /-

## భారత్ లో 30 శాతానికి పైగా తగ్గిన ఆత్మహత్యల మరణాల రేటు

**జనంవెలుగు, న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 20:–** భారతదేశంలో ఆత్మహత్యల మరణాల రేటు 30 శాతానికి పైగా తగ్గిందని ది లాన్సెట్ పబ్లిక్ హెల్త్ అధ్యయనం తాజాగా వెల్లడించింది. ఆత్మహత్య మరణాల రేటు 1990లో లక్ష జనాభాకు 18.9గా ఉండేదని పేర్కొంది. అయితే 2019లో అది లక్ష జనాభాకు 13.1 శాతానికి, 2021లో లక్ష జనాభాకు 13 శాతానికి పడిపోయినట్లు వెల్లడించింది. 1990 నుంచి 2021 వరకూ భారత్‌లో ఆత్మహత్యల మరణాల రేటు 31.5 శాతానికి తగ్గినట్లు పేర్కొంది.లాన్సెట్ అధ్యయనం ప్రకారం.. ఆత్మహత్యల ద్వారా మరణాల రేటు తగ్గడం మగవారి కంటే ఆడవారిలోనే ఎక్కువగా కనిపించింది. 1990లో స్త్రీలలో ఆత్మహత్య మరణాల రేటు లక్ష జనాభాకు 16.8 శాతంగా ఉండగా.. అది 2021లో లక్ష జనాభాకు 10.3 శాతానికి తగ్గింది. ఇక 1990లో పురుషుల ఆత్మహత్యల రేటు లక్ష జనాభాకు 20.9 శాతంగా ఉంది. 2021 నాటికి అది లక్ష జనాభాకు 15.7కు తగ్గింది. '2020లో భారతదేశంలో అత్యధిక ఆత్మహత్యల మరణాల రేటు విద్యావంతులైన మహిళల్లోనే కనిపించింది. ఇందుకు కారణం కుటుంబ సమస్యలే' అని యూఎస్ వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్ పరిశోధకులు తెలిపారు.ఇక ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 740,000 ఆత్మహత్యలు నమోదవుతున్నాయి. అంటే సగటున ప్రతి 43 సెకన్లకు ఒకరు సూసైడ్ చేసుకుంటున్నారన్నమాట. గత మూడు దశాబ్దాల్లో వయస్సు-ప్రామాణిక మరణాల రేటు దాదాపు 40 శాతానికి తగ్గింది. లక్ష జనాభాకు 15 మరణాల నుంచి లక్ష జనాభాకు 9 మరణాలకు చేరింది. ఇందులో ఆడవారిలో మరణాల రేటు 50 శాతానికి క్షీణించగా.. పురుషుల్లో 34 శాతానికి తగ్గింది. మొత్తం మీద ఆత్మహత్యల మరణాల రేటు మగవారిలో లక్ష జనాభాకు 12.8 శాతంగా, స్త్రీలలో లక్ష జనాభాకు 5.4 శాతంగా ఉంది.

# ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం

**ప్రమాణం చేయించిన లెప్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా**

**రేఖా గుప్తాతోపాటు ఆరుగురు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం**

**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, ధర్మేంద్ర ప్రదాన్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో సహా 12 రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు.**

**జనంవెలుగు, న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 20:–** దేశ రాజధాని ఢిల్లీలో 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కాషాయ జెండా రెపరెపలాడింది. ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. నగరంలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రేఖా గుప్తా చేత లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రమాణం చేయించారు.ఢిల్లీకి తొమ్మిదో సీఎంగా, నాలుగో మహిళా ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా రికార్డు సృష్టించారు. అంతకుముందు సుష్మా స్వరాజ్, షీలా దీక్షిత్, అతిశీ ఢిల్లీ ముఖ్యమంత్రులుగా సేవలందించిన విషయం తెలిసిందే. ఇక, సీఎం రేఖా గుప్తాతోపాటు ఆరుగురు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. పర్వేశ్ వర్మ, ఆశిష్ సూద్, మంజీందర్ సింగ్ సిర్సా, పంకజ్ సింగ్, కపిల్ మిశ్రా, రవీంద్ర ఇంద్రజ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.రామ్‌లీలా మైదానంలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, ధర్మేంద్ర ప్రదాన్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ సహా 12 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలు, బీజేపీ నేతలు, వ్యాపార, సినీ ప్రముఖులు హాజరయ్యారు.అంతకుముందు సీఎం రేఖా గుప్తా తన నివాసం నుంచి భారీ ర్యాలీగా రామ్‌లీలా మైదానానికి చేరుకున్నారు. మార్గం మధ్యలో మార్గట్ వాలే బాబా టెంపుల్‌లో పూజలు చేశారు. ఇదిలా ఉండగా.. ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా రామ్‌లీలా మైదానం వద్ద 25 వేల మందితో భారీ భద్రత ఏర్పాటు చేశారు. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ భద్రతను



నిర్వహించారు.

### ఎవరీ రేఖా గుప్తా?

ఢిల్లీకి కాబోతున్న నాలుగో మహిళా ముఖ్యమంత్రి రేఖా గుప్తా. ఇంతకుముందు సుష్మా స్వరాజ్, షీలా దీక్షిత్, ఆతిశీ మహిళా సీఎంలుగా పని చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ అభ్యర్థి బందన కుమారిపై 29 వేల ఓట్ల భారీ మెజారిటీతో షాలిమార్‌బాగ్ నుంచి రేఖా గుప్తా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఎమ్మెల్యేగా ఎన్నికవడం ఆమెకు ఇదే మొదటిసారి. విద్యార్థి దశ నుంచి ఆర్ఎస్ఎస్ అనుబంధ విద్యార్థి విభాగం ఏబీవీపీలో ఆమె చురుగ్గా పని చేశారు.1996లో ఢిల్లీ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. సౌత్ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో మూడుసార్లు కౌన్సిలర్‌గా, ఒకసారి మేయర్‌గా పని చేశారు. ప్రస్తుతం ఆమె బీజేపీ మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. 1974లో హర్యానాలోని జింద్ జిల్లా నంద్‌గఢ్ గ్రామంలో రేఖా గుప్తా జన్మించారు. ఆమె తండ్రి ఎస్బీఐ అధికారిగా ఢిల్లీకి బదిలీ కావడంతో రేఖా గుప్తా కుటుంబం ఇక్కడ స్థిరపడింది.కాగా, ఇటీవలే జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకు గానూ బీజేపీ 48 స్థానాల్లో గెలుపొందిన విషయం తెలిసిందే. ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం 22 స్థానాలకే పరిమితమైంది. ఇక కాంగ్రెస్ పార్టీ ఖాతా కూడా తెవరలేదు. ఈ ఎన్నికల్లో గెలుపుతో దాదాపు 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కమలం పార్టీ ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

## ఇంటర్ హాల్ టిక్కెట్లు వచ్చేశాయ్

**జనంవెలుగు, హైదరాబాద్, ఫిబ్రవరి 20:–** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1535 సెంటర్లలో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు, అలాగే మార్చి 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇప్పటికే ఇంటర్ బోర్డు షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. ఇక జనరల్ పరీక్షలు మార్చి 15వ తేదీతో ముగియనున్నాయి. ఫిబ్రవరి 5వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ప్రాక్టికల్ పరీక్షలు నేటితో (ఫిబ్రవరి 20వ తేదీతో) ముగుస్తాయి. ఈ ఏడాదికి ఇంటర్ పరీక్షలకు మొత్తం 10,58,893 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఇంటర్ బోర్డు వెల్లడించింది.మొత్తం విద్యార్థుల్లో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 5,00,963 మంది, ఒకేషనల్ విద్యార్థులు 44,581 మంది ఉన్నారు. మొత్తం విద్యార్థుల్లో జనరల్ విద్యార్థులు 4,71,021 మంది, ఒకేషనల్ విద్యార్థులు 42,328 మంది ఉన్నారు. ఇక ఇంటర్ పరీక్షలకు ఈ రోజు నుంచి హాల్‌టికెట్లు పంపిణీకి ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేసింది. పరీక్షల నిర్వహణకు గత ఏడాది అనుసరించిన విధానాలనే ఈసారి కూడా అమలు చేస్తున్నట్లు బోర్డు పేర్కొంది. పరీక్షలు జరిగే అన్ని గదుల్లో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.పరీక్షల సమయంలో ప్రశ్నపత్రాల ట్యాంపరింగ్, పేపర్ లీకేజీలను అరికట్టేందుకు గతేడాది మాదిరిగానే క్యూఆర్ కోడ్ విధానం అనుసరిస్తారు. దీని ద్వారా ఎక్కడైనా ప్రశ్నపత్రం బయటకు వస్తే.. అది ఎక్కడ నుంచి వచ్చింది అనేది విషయం సెంటర్‌తో సహా సమస్త వివరాలు వెంటనే తెలిసిపోతాయి. దీనిపై ఒకటి, రెండు రోజుల్లో ఇంటర్ బోర్డు ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి పరీక్షల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేయనుంది.

# అగ్రరాజ్యానికి కేసీఆర్




**జనంవెలుగు, హైదరాబాద్, ఫిబ్రవరి 29:–** బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మారుతున్న రాజకీయాలకు అనుగుణంగా అడుగులు వేయకుంటే పార్టీ మటాష్ అవుతుందని భావించారట పెద్దాయన. ఆ విధంగా అడుగులు వేసినట్టు కనిపిస్తోంది. బీసీల అంశం పార్టీలో ఏ మాత్రం ప్రస్తావనకు రాకుండా జాగ్రత్త పడ్డారు. ఈ క్రమంలో పాత అంశాలను ప్రస్తావించినట్టు కొందరు నేతలు చెబుతున్నారు.పార్టీలో ఇప్పటివరకు వర్కింగ్ ప్రెసిడెంట్ ఒక్కరే ఉన్నారు. ఆ సంఖ్యను నాలుగుకు చేర్చాలని నిర్ణయం తీసుకున్నారట పార్టీ అధినేత. ఇప్పటివరకు కేటీఆర్ ఒక్కటే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉండేవారు. కేటీఆర్‌తోపాటు మరో ముగ్గురికి అవకాశం కల్పించనున్నా రట. వారిలో మహిళలకు ఎక్కువగా ఛాన్స్ ఉందని పార్టీ వర్గాల మాట. ఒకరు బీసీ, మరొకరు ఎస్సీ, ఇంకొకరు టాప్ కమ్యూనిటీకి చెందిన మహిళ ఉండనున్నట్లు తెలుస్తోంది. పార్టీ ఇంతలా దిగజారి పోవటానికి మీరే కారణమని కొందరు సీనియర్లు తప్పుబట్టారని తెలుస్తోంది. తొలుత ఇంటి సమస్యలు సరిదిద్దుకుంటే, ప్రత్యర్థులకు ధీటుగా బదులు ఇవ్వవచ్చని చెప్పినట్టు సమాచారం. ఒకానొక దశలో యువనేతపై కేసీఆర్ కాసింత ఆగ్రహం వ్యక్తం చేసినట్టు పార్టీ వర్గాల మాట. ఇంటిని చక్కదిద్దుకునే పనిలో భాగంగా హాజరైన నేతల నుంచి అభిప్రాయసేకరణ చేశారు.పార్టీలకు అనుగుణంగా బహిరంగ సభ నిర్వహణ, కొన్ని కమిటీలకు ఇన్‌ఛార్జ్‌గా హరీష్‌రావుకు బాధ్యతలు అప్పగించారు కేసీఆర్. ఆ విషయాన్ని మీడియా సమావేశంలో కేటీఆర్ వెల్లడించారు. గత ఎన్నికల్లో మహిళలు బీఆర్ఎస్‌ను చావదెబ్బ కొట్టారని కేసీఆర్‌కు పలు నివేదికలు అందాయి. ఈ నేపథ్యంలో పార్టీలో మహిళలకు పెద్ద పీఠ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. పార్టీలో ప్రత్యేకంగా మహిళా విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దానికి అధ్యక్షురాలిగా కవితను నియమించే ఛాన్స్ ఉన్నట్లు సమాచారం.మరోవైపు కేసీఆర్ అమెరికా టూర్ వెళ్లాలని నిర్ణయించినట్టు పార్టీ వర్గాల మాట. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ నివేదిక తుది దశకు చేరింది. రేపో మాపో రేవంత్ ప్రభుత్వానికి అందజేయనుంది. ఈ నేపథ్యంలో ఆయన అమెరికా టూర్‌కి శ్రీకారం చుట్టడంపై పలు అనుమానాలు మొదలయ్యాయి. ఇందులోభాగంగా ఫామ్ హౌస్ నుంచి పార్టీ ఆఫీసుకు వెళ్లకుండా కేసీఆర్ పాస్‌పోర్టు ఆఫీసుకు వెళ్లారని అంటున్నారు.ప్రభుత్వం మారిన వెంటనే డిప్లమాటిక్ పాస్‌పోర్టును అప్పగిస్తారు మాజీ ముఖ్యమంత్రులు. ఏడాది తర్వాత డిప్లమాటిక్ పాస్‌పోర్టు ఇవ్వరని అంటున్నారు. ఈ క్రమంలో ఏపీ జగన్ విషయాన్ని గుర్తు చేశారు. ఇక కేసీఆర్ అమెరికాలో ఉండేందుకు రెండునెలలుగా తెర వెనుక ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా కేసీఆర్ ఫారెన్ టూర్ వెళ్లడం పక్కాగా ఖాయమన్నమాట.

## 24న రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల నిరసన

**-టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు**

**-సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**జనంవెలుగు, హైదరాబాద్:–** జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద జర్నలిస్టులు నిరసన తెలియజేస్తూ కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. జర్నలిస్టులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గం పిలుపునిచ్చింది. హైదరాబాద్ లో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య గత కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణ పై నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన ఫెడరేషన్ ఆఫీస్ బేరర్లు,కార్యవర్గ సభ్యులు ఆయా అంశాలపై దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలతో పాటు తక్షణం పరిష్కరించాల్సిన పలు అంశాలపై పై సమావేశంలో చర్చించి తీర్మానాలు చేశారు. సమావేశం ఆమోదించిన తీర్మానాలను ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య గురువారం మీడియాకు విడుదల చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, పెన్షన్ స్కీం, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు, చిన్న,మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వ గుర్తింపు, జర్నలిస్టుల ప్రత్యేక రక్షణ చట్టం తదితర డిమాండ్ల పరిష్కారాని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేస్తూ తీర్మానించిందని తెలిపారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంత వరకు ఏ ఒక్క సమస్యనూ



పరిష్కరించలేదని అన్నారు. జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వకుండా జీవో 239 సమీక్ష, సవరణ కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నదనీ,దీని వల్ల జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని వాఖ్యానించారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడానికి కొత్త ప్రభుత్వానికి ఏడాదిగా సమయం ఉన్నా, ఇంత వరకు పరిష్కరించ లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

### 25 నుంచి సభ్యత్వ నమోదు

రాష్ట్రవ్యాప్తంగా ఈనెల ఫిబ్రవరి 25 నుంచి మార్చి 25వ తేదీ వరకు నెల రోజుల పాటు ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని సమావేశం తీర్మాణం చేసింది.అన్ని జిల్లాల్లో సభ్యత్వ నమోదు జరుగుతుందని, జర్నలిస్టులంతా ఐక్యత, హక్కుల సాధన కోసం ఫెడరేషన్ లో సభ్యులుగా చేరి భవిష్యత్తు కార్యాచరణలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత అన్ని జిల్లాల ఫెడరేషన్ మహాసభలు నిర్వహించాలని, మార్చి 29న రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం జరపాలని సమావేశం నిర్ణయించినట్లు వారు తెలిపారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, పిల్లి రాంచందర్, బండి విజయ్ కుమార్, గుడిగ రఘు, కొప్పు నిరంజన్, విజయానంద్, కోశాధికారి రాచమల్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శులు సలీమా, తన్నీరు శ్రీనివాస్, కల్రా అనిల్ రెడ్డి, ఈ. చంద్రశేఖర్, జగదీష్, రాజశేఖర్, మానిక్ ప్రభు, నవీన్, కార్యవర్గ సభ్యులు మణిమాల, కె. పాండురంగారావు, నాయిని శ్రీనివాస రావు, పి నాగవాణి, పరిపూర్ణం, రమేష్, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

# పంటల క్రయవిక్రయాలను నిశితంగా పర్యవేక్షించాలి

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**
**రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశం**



**జనం వెలుగు, నిజామాబాద్, ఫిబ్రవరి 20:** ఎర్రజొన్న, తెల్లజొన్న, పసుపు పంటల అమ్మకాలు ప్రారంభం అయినందున క్రయవిక్రయాలను నిశితంగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. పంట దిగుబడులను విక్రయించే విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రేడర్లు, సీడ్ వ్యాపారులు మార్కెట్ రేటుకు అనుగుణంగా ధరను చెల్లిస్తూ, రైతుల వద్ద నుండి పంటను సేకరించేలా చూడాలన్నారు. జొన్న, పసుపు పంటల దిగుబడులు చేతికందుతున్న నేపథ్యంలో, గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి కలెక్టర్ వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు, ట్రేడర్లు, విత్తన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుత సీజన్ లో సాగు చేసిన జొన్న, పసుపు పంటల విస్తీర్ణం, పంట దిగుబడులు, ఎర్రజొన్న రైతులతో ఆయా కంపెనీల వ్యాపారులు కుదుర్చుకున్న ఒప్పందం, స్వేచ్ఛ విఫణిలో ఆయా పంటలకు లభిస్తున్న ధర, మార్కెట్ డిమాండ్ తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులతో కుదుర్చుకున్న బైబ్యాక్ ఒప్పందానికి కట్టుబడి తెల్లజొన్న, ఎర్రజొన్న కొనుగోళ్లు జరగాలని, రైతులు బయట మార్కెట్లో ఎక్కువ ధరకు ఇతర ట్రేడర్లకు పంట అమ్ముకోవాలని భావిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని ఈ సందర్భంగా కలెక్టర్ సీడ్ వ్యాపారులకు సూచించారు. మార్చి నెల 15వ తేదీ వరకు మార్కెట్ కు జొన్న, పసుపు పంట దిగుబడులు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా సాఫీగా క్రయవిక్రయాలు జరిగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పసుపు పంటను బాగా ఆరబెట్టి తీసుకుని వచ్చేలా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని, తద్వారా పూర్తిస్థాయిలో వారు మార్కెట్ డిమాండ్ మేరకు ధర పొందవచ్చని అన్నారు. తేమ శాతం కారణంగా రైతులు నష్టపోకూడదని సూచించారు. మార్కెట్ యార్డుకు పసుపు నిల్వలను రైతులు తీసుకువచ్చిన వెంటనే జాప్యానికి తావులేకుండా వెంటదివెంట తూకం జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. డైరెక్ట్ పర్చేస్ సెంటర్ ల ద్వారా రైతులు పంటలు విక్రయించేలా చూడాలన్నారు. క్రయవిక్రయాలకు సంబంధించి ఇది ఎంతో కీలక సమయం అయినందున జాగరూకతతో విధులు నిర్వర్తించాలని, ఏ దశలోనూ రైతులు నష్టపోకుండా, ఇబ్బందులకు గురికాకుండా అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ హితవు పలికారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయాన్ని పెంపొందించుకుని పంటల క్రయవిక్రయాలు సాఫీగా జరిగేలా చొరవ చూపాలన్నారు. పంట విక్రయించిన రైతులకు వెంటవెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే తక్షణమే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఎక్కడ కూడా వ్యాపారులు కూడబలుక్కుని ధర తగ్గించారనే ఫిర్యాదులు రాకూడదని, మార్కెట్ డిమాండ్ ను అనుసరిస్తూ రైతులకు పూర్తి స్థాయిలో ట్రేడర్లు ధర చెల్లిస్తున్నారా లేదా అన్నది పరిశీలించాలని అన్నారు. రైతులను మోసగించే చర్యలకు పాల్పడే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ ఏ.డీ గంగవ్వ, ఏ.డీ.ఏలు, ఏ.ఓలు, పసుపు ట్రేడర్లు, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇటుకబటిల్లో మగ్గుతున్న బాల్యం

**పట్టించుకోని అధికారులు**
**ఇటుకబట్టి యజమానులపై తగు చర్యలు తీసుకోవాలి:సిపిఐ డిమాండ్.**




**జనం వెలుగు, బాల్కొండ:–** బాల్కొండ మండలంలోని ఇత్వర్ పేట్, జలాల్ పూర్, బస్సాపూర్ గ్రామాలతో పాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కట్ట సమీపాన అనుమతులు లేకుండా నడిపిస్తున్న ఇటుక బట్టీలలో బాల కార్మికులు పనిచేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సిపిఐ డివిజన్ కమిటి నాయకుడు సోమ శ్రీను ఆరోపించాడు. బాల్కొండలోని డిప్యూటీ తహసీల్దార్ కు గురువారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఇటుక బట్టీలలో బాలకార్మికులు పని చేస్తున్న చూస్తు పట్టించుకునే నాథుడే కరువైనాడని ఆయన ఆందోళన వ్యక్తం చేశాడు. మండలంలోని బస్సాపూర్, ఇత్వర్ పేట్, శ్రీరాంసాగర్ కట్ట కింది భాగంలో గల కొంత మంది రైతులకు చెందిన భూములను అద్దెకు తీసుకుని ఇటుక బట్టి పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపాడు. ఆ భూములు ఎవరివో విచారణ జరిపి, భూ యజమానులకు ప్రభుత్వ ఉచిత సంక్షేమ పథకాలు అందకుండా చూడాలని ఆయన అన్నాడు. అనుమతులు లేకుండా, బాల కార్మికులతో పని చేయిస్తున్న అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం సరికాదని ఆయన అన్నాడు. ఇటుక బట్టీల భూ యజమానులకు తక్షణమే నోటీసులు జారీ చేయాలని, ఇటుక బట్టి యజమానులపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని డిటికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబందిత అధికారులు స్పందించకుంటే దీనిపై కలెక్టర్ కు పిర్యాదు చేస్తామని ఆయన తెలిపాడు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మాదిరి నరేష్, దుర్గం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వర్గీకరణ విషయంలో ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదు.




**జనం వెలుగు, హైదరాబాద్:–** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నివాసంలో దళిత బంధు సాధన సమితి సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేసారు. ఎస్సీ వర్గీకరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్ర ఏమీ లేదు. వర్గీకరణ విషయంలో ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదు. సుప్రీం కోర్టు తీర్పు వల్ల వర్గీకరణకు బాటలు పడ్డాయి. షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికను బయటపెట్టి.. వెంటనే వర్గీకరణ చేయాలి. దళితుల మధ్య పంచాయతీ పెట్టవద్దు. ఎవరికీ అన్యాయం జరగకుండా వర్గీకరణ ఉండాలి. ఎస్సీ వర్గీకరణ పేరు చెప్పి సీఎం రేవంత్ రెడ్డి మరో మోసం చేశారని అన్నారు. వర్గీకరణకు, ఉద్యోగాల కల్పనకు ముఖ్యమంత్రి లింక్ పెడుతున్నారు. వర్గీకరణ వంకతో జాబు క్యాలెండర్ అమలును నిలిపివేయవద్దు. కోర్టు తీర్పు వచ్చి 6 నెలలు గడిచినా ఆలూలేదు చూలు లేదన్నట్లుగా ఉంది. రేవంత్ రెడ్డి మాటలు చెబితే నమ్మరని ఢిల్లీ నుంచి ప్రియాంగా గాంధీని తీసుకొచ్చి హామీ ఇప్పించారు. దళిత కుటుంబాలకు రూ. 10 లక్షలకు బదులు 12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు. ముఖ్యమంత్రికి ప్రభుత్వాన్ని నడపడం చేతకావడం లేదు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సీఎం రేవంత్ రెడ్డి కుదేలు చేశారు. ఇప్పటికే కేసీఆర్ మంజూరు చేసిన దళిత బంధు నిధులను విడుదల చేయాలి. ధైర్యం ఉంటే 18 వేల దళిత కుటుంబాలకు దళిత బంధు డబ్బులను డిమాండ్ చేయాలి. బడ్జెట్ ప్రవేశపెట్టే ముందే ఈ డబ్బులు విడుదల చేయాలి. ఎస్సీలకు బడ్జెట్ లో 33 వేల కోట్లు కేటాయించి. కేవలం 9800 కోట్లే ఖర్చు చేశారని అన్నారు. ముందుచూపుతో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కు కేసీఆర్ చట్టబద్ధత కల్పించాలి. రేవంత్ రెడ్డిది మనసున్న ప్రభుత్వం కాదు.. మానవత్వం లేదు . రేవంత్ రెడ్డి ఆలోచన చిన్నది ... చూపు పెద్దవాళ్లపైనే ఉంది. అందుకే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి పూలదండ కూడా వేయలేదు. అంబేద్కర్ను, ఆయన వారసులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానిస్తున్నారని అన్నారు. కేసీఆర్ ఆలోచన అమలైతే దళిత కుటుంబాల్లో దరిద్రం ఉంటుందా ? దళిత బంధును అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. స్వతంత్రం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ దళితులను మోసం చేస్తూనే ఉందని అన్నారు.

# బేటీ బచావో బేటీ పఢావో

**జనం వెలుగు, భీంగల్:–** భీమ్ గల్ మండల గోను గొప్పుల గ్రామంలో మహిళ, శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ, జిల్లా మహిళా జిల్లా బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పఢావో పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భముగా నిజామాబాద్ జిల్లా, భీంగల్ ప్రాజెక్ట్, భీంగల్ మండల్ గోను గోప్పుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి విద్యార్థినీలతో అవగాహన కార్యక్రమం నిర్వహించడము జరిగింది. ఈ కార్యక్రమం లో సీడీపీఓ స్వర్ణ లత మాట్లాడుతూ జాతీయ బాలిక దినోత్సవం వేడుకలు పురస్కరించుకొని ఆడపిల్లల యొక్క లింగ నిష్పత్తిని పెంచడం, లింగ నిష్పత్తిని తగ్గిదలను అరకట్టాలని చెప్పారు. ఆడపిల్లలు మగ పిల్లలు సమాజంలో సమానమని తెలుపుతూ ఇద్దరికి కూడా సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు శిశు భ్రూణ హత్యల గురించి వివరిస్తూ హత్యలు జరగకుండా ముందుగానే చూసుకోవాలి, ఆడపిల్లల ప్రాముఖ్యతను వివరిస్తూ ఆడపిల్లల యొక్క ప్రాముఖ్యత ఎందుకు తగ్గుతుంది అంటే చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేయడం ద్వారా భృణ హత్యలకు పాల్పడడం ద్వారా అఘాయిత్యాలు వల్ల ఆడపిల్లలు మరియు పసిపిల్లలు యొక్క మరణాలు ఎక్కువైతున్నాయని వివరించడం జరిగింది. సూపర్వైజర్ శారదా, సౌమ్య, స్వప్న ఫిల్మ్ షో




ద్వారా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి, వాటిని అధిగమించిన వాళ్ళు సాధించిన విజయాల గురించి వివరించాడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాధన సంస్థ కమ్యూనిటీ సోషల్ మొబైల్ లేజర్ నిరీక్షణ, పాఠశాల ప్రధానోపాధ్యాయు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం పాఠశాల టీచర్స్, పోషణ అభియాన్ ప్రశాంత్, అంగన్వాడీ టీచర్స్ ప్రమీల, పుష్ప, రాంకబాయ్ పాల్గొనడం జరిగింది.

## చిన్నారి అవంతికకు చేయూత అందించిన ఉపాధ్యాయులు



**జనంవెలుగు, నందిపేట్:–** నందిపేట మండల కేంద్రానికి చెందిన 9 సంవత్సరాల దర్శనం అవంతిక, మండల కేంద్ర ప్రాథమిక పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న ఈ చిన్నారి, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృత్యువుతో పోరాడుతోంది. మూడవ ఏట నుంచే నెఫ్రోటిక్ సిండ్రోం అనే తీవ్రమైన వ్యాధి ఆమెను వెంటాడుతూనే ఉంది. ఇటీవల వ్యాధి మరింత తీవ్రంగా మారడంతో రెండు కిడ్నీలు పనిచేయకుండా పోయాయి. దీంతో వైద్యులు వెంటనే కిడ్నీ మార్పిడి చేయించుకోవాలని సూచించారు. అవంతిక తల్లి హొటల్ లో పనిచేస్తూ తమ కుటుంబాన్ని పోషించుకుంటోంది. కుమార్తెకు చికిత్స చేయించేందుకు ఆమె శతవిధాలా ప్రయత్నించినా, ఆర్థిక పరిస్థితి దీనావస్థలో ఉంది. ఈ విషయం తెలుసుకున్న అవంతిక పాఠశాల ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, తోటి ఉపాధ్యాయులకు సమాచారం అందించడంతో, ఉపాధ్యాయులు వెంటనే స్పందించి తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయాన్ని అందించారు. మరింత స్ఫూర్తిదాయకంగా, అవంతికతో చదువుకునే విద్యార్థులు కూడా తమ పాకెట్ మనీని అందజేశారు. గురువారం ఉపాధ్యాయులు కలిసి అవంతిక ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించి, సేకరించిన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. చిన్నారి ఆరోగ్యానికి తమ వంతు సహాయాన్ని అందించడమే కాకుండా, మిగతా సమాజాన్ని కూడా ఈ సహాయానికి ఉత్సాహపరిచేలా ముందుకు వచ్చారు. ఈ మానవతా దృక్పథాన్ని చూపిన ఉపాధ్యాయుల కృషిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ప్రాథమిక ప్రధానోపాధ్యాయులు మల్కన్న, ఉపాధ్యాయులు గజేంద్రనాథ్, జిల్లా పి ఆర్ టి యు ఉపాధ్యక్షురాలు, తొండకూర్ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, మమత, సుజాత, సునంద, అర్చన కుమారి తదితరులు పాల్గొన్నారు.

## టెలికాం అడ్వైజరి కమిటీ డైరెక్టర్ గా ప్రసాద్ గౌడ్ నియామకం



**జనంవెలుగు, బాల్కొండ:–** బాల్కొండ మండల కేంద్రానికి చెందిన మిద్దెల ప్రసాద్ గౌడ్ ను జిల్లా టెలికాం అడ్వైజర్ కమిటీ డైరెక్టర్ గా నియమించారు. నిజామాబాద్ జిల్లా బిఎస్ఎన్ఎల్ టెలికాం డైరెక్టర్ గా తన నియామకానికి కృషి చేసిన రాజ్యసభ సభ్యుడు సురేష్ రెడ్డికి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## 6వ రీజినల్ పోస్టల్ పెన్షన్ అదాలత్ - 2025 మార్చి 25న ఆన్లైన్ లో నిర్వహణ

**జనంవెలుగు, నిజామాబాద్, ఫిబ్రవరి 20:–** హైదరాబాద్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఆధ్వర్యంలో 6వ రీజినల్ పోస్టల్ పెన్షన్ అదాలత్ 2025 మార్చి 25న ఉదయం 11:00 గంటలకు ఆన్లైన్ ద్వారా నిర్వహించబడనున్నది. ఈ మేరకు నిజామాబాద్ సీనియర్ సూపరింటెండెంట్ జనార్దన్ రెడ్డి వెల్లడించారు. పోస్టల్ పెన్షన్ సేవలకు సంబంధించిన తమ ఫిర్యాదులను పెన్షనర్లు నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఫిర్యాదులను Postal Pension Adalat of Hyderabad Region అని పోస్టల్ ఎన్వెలప్ లేదా కవర్ పై స్పష్టంగా రాసి, 20.03.2025 లోపు కింది చిరునామాకు పంపాలని సూచించారు. ఫిర్యాదిదారు తమ ఫోన్ నెంబర్, ఈమెయిల్ ఐడి లేదా చిరునామా తప్పనిసరిగా సమర్పించాలి. ఆన్లైన్ మీటింగ్ లింక్ ఫిర్యాదిదారుల ఫోన్ నెంబర్కు SMS ద్వారా పంపబడుతుంది.

## జ్యోతిబా పూలే పాఠశాలలో రాత్రి బస చేసిన కలెక్టర్



**జనంవెలుగు, నిజామాబాద్, ఫిబ్రవరి 20:** బోధన్ పట్టణంలో కొనసాగుతున్న ఎడపల్లి మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలుర సంక్షేమ పాఠశాలలో కలెక్టర్ గురువారం రాత్రి బస చేశారు. పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల స్టడీ అవర్స్ కొనసాగుతుండడాన్ని గమనించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, విద్యా బోధన, రోజువారీ దినచర్య, మెనూ తదితర వివరాలను పాఠశాల ప్రిన్సిపాల్ జైపాల్ ను అడిగి తెలుసుకున్నారు. స్టడీ అవర్స్ కొనసాగుతున్న గదులను సందర్శించి విద్యార్థులతో కలెక్టర్ భేటీ అయ్యారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా వారికి అందించిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, ఇతర వసతులను పరిశీలించారు. అన్ని తరగతి గదులను, డార్మెటరీ, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాల పరిశీలన జరిపారు. స్టోర్ రూమ్ లో నిలువ ఉంచిన సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి పాఠశాలలోనే కలెక్టర్ నిద్రించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్.సీ. ఓ సత్యనాథ్ రెడ్డి, తహసీల్దార్ విఠల్ తదితరులు ఉన్నారు.

## రెంజల్లో నీటి నాణ్యత అవగాహన సదస్సు



**జనంవెలుగు, నిజామాబాద్, ఫిబ్రవరి 20:** భూగర్భ జల శాఖ, నిజామాబాద్ జిల్లా వారి ఆధ్వర్యంలో గురువారం రెంజల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో సంచార నీటి నాణ్యత ప్రయోగశాల ద్వారా నీటి నాణ్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయదారులు, విద్యార్థులు, భూగర్భజల వినియోగదారులు పాల్గొని, నీటి నాణ్యతపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. వారు తెచ్చిన నీటి నమూనాలను నాణ్యత ప్రయోగశాలలో పరీక్షించి, వాటి ఫలితాలను తెలియజేశారు. సదస్సులో జిల్లా భూగర్భ జల శాఖ ఉపసంచాలకులు పి. శ్రీనివాసు బాబు, రెంజల్ మండల ఎంపీడీవో వెంకటేష్, జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు గంగాధర్, నరేందర్, నామ్దేవ్, సహాయక భూభౌతిక శాస్త్రవేత్త నికత్ పర్వీన్, సహాయక భూగర్భ జల శాస్త్రవేత్త టి. హరీష్, ఏ. సాయిలు, జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.